## క్లుప్తంగా

### నల్లబ్యాడ్జీలతో ఆందోళన

మదనాపురం: రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉపాధి హామీ పథకం ఉద్యోగులు పెండింగ్ ఉన్న మూడు నెలల జీతాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీల తో ఆందోళన చేపట్టారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసన్నకుమారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ బాలయ్య, టీఏలు ఆంజనేయులు, భరత్, జ్యోతి, కంప్యూటర్ ఆపరేటర్లు ఆంజనేయులు, తిరుపతయ్య, ఈసీ అక్షిత పాల్గొన్నారు.

### పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరసన

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ తండా మాజీ సర్పంచ్ శాంతమ్మ జీపీ భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీపీలో అభివృద్ధి పనులకు సంబంధించి దాదాపుగా రూ.12 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో పదవిలో ఉన్న సమయంలో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసినా నేటికీ బిల్లులు చెల్లించలేదని వాపోయారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని పలుమార్లు కలెక్టర్, డీపీఓకు వినతిపత్రాలు అందజేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీపీ పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు.

### సీఐ శివకుమార్‌కు సన్మానం



ఆత్మకూర్: జిల్లా ఉత్తమ సీఐగా అవార్డు అందుకున్న ఆత్మకూర్ సీఐ శివకుమార్‌ను నాయకులు బుధవారం ఆయన కార్యాలయంలో పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందిస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేందర్, నాయకులు ఏటికాడి ఆనంద్, ప్రభాకర్‌రెడ్డి, చాయపత్త శ్రీనివాసులు, నాగన్న, వెంకటన్న, గద్వాల శ్రీను, రామచంద్రయ్య, సురేందర్, నరేందర్, శ్రీహరి, వెంకటేశ్వర్‌గౌడ్, మహ్మద్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

### స్థల దాతకు అభినందన

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని 10వ వార్డు విద్యానగర్ కాలనీలో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం, డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో కాలనీకి చెందిన కదిర రామ్మోహన్‌రెడ్డి ప్రజల సౌకర్యార్థం రూ.50లక్షల విలువ చేసే స్థలాన్ని రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం దానం ఇచ్చాడు. ఇందుకు సంబంధించిన పట్టాలను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ అందజేశారు. వార్డుల అభివృద్ధి కోసం రామ్మోహన్‌రెడ్డి మాదిరిగా ఆయా కాలనీ వాసులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు.

### 'అభివృద్ధిని విస్మరించారు'

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలం దాటుతున్నా గ్రామంలో డ్రెయినేజీలు, సీసీ రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. గ్రామంలో సీసీ రోడ్ల కోసం కేటాయించిన రూ.15 లక్షలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాసిరకంగా సీసీ రహదారులు వేశారని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీను, గోవింద్, రాములు పాల్గొన్నారు.

### బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

ఆత్మకూర్: ప్రజా గాయకుడు గద్దర్‌ను అవమానించిన బండి సంజయ్‌ను కేంద్ర ప్రభుత్వం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అతిథిగృహంలో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్, ఎమ్మార్పీఎస్, శాంతి సంఘం, వాల్మీకిసంఘం నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ శెట్టి, రవికుమార్‌యాదవ్, రాజు, ప్రసాద్, మండ్లరామకృష్ణ, రాబర్ట్, మాసన్న, మోష తదితరులు ఉన్నారు.

### మీసేవ నిర్వాహకులకు అవగాహన

కొత్తకోట (ఆత్మకూర్): మీసేవా కేంద్రాల్లో వివిధ సర్టిఫికెట్ల నమోదులో తప్పులు నమోదు చేస్తున్నారని దీని కారణంగా దరఖాస్తుదారులతో పాటు అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారని తహసీల్దార్ చాంద్‌పాష అసహనం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీసేవా నిర్వాహకులతో సమావేశమై పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రంలో డీటీ ప్రసాద్, ఆర్ఐ ఆసీఫ్, సిబ్బంది నాగేంద్రప్రసాద్, చంద్రశేఖర్, రాము, మహిమూద్, నారాయణ, పరశురాం, సంపత్, నయ్యూం, హరీశ్ ఉన్నారు.

# నిరసన బాటలో 'ఉపాధి' సిబ్బంది



మదనాపురం మండలం కొత్తపల్లిలో పూడికతీత పనుల్లో ఉపాధి కూలీలు (ఫైల్)

- పెండింగ్ వేతనాల చెల్లింపుల్లో అలసత్వం
- అమలు కాని పేస్కేల్
- సెలవు దినాల్లో పని చేసినా అంతే..

అమరచింత: జాతీయ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పేస్కేల్ అమలు, పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ 29 నుంచి ఫిబ్రవరి 12 వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే బుధవారం జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓలకు వినతిపత్రాలు అందించారు. మూడు నెలలుగా వేతనాలు చేతికి అందకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందని వారు వాపోయారు. తమ హక్కులను పరిరక్షించుకునేందుకు జేఏసీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరసన బాట పట్టినట్లు ఆయా మండలాల ఏపీఓలు తెలిపారు. రెండు రోజుల కిందట తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో డీఆర్‌డీఓలకు, మంత్రి సీతక్క, సంబంధిత శాఖ కమిషనర్‌కు వినతిపత్రాలు అందించినా స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పేస్కేల్ అమలుతో పాటు రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు.



డీఆర్డీఓ ఉమాదేవికి వినతి పత్రాన్ని ఇస్తున్న ఉపాధి జేఏసీ నాయకులు (ఫైల్)

**జిల్లాలో ఇలా..**

జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న సిబ్బంది జేఏసీ పిలుపులో భాగంగా నిరసన బాట పట్టారు. 10 మంది ఏపీఓలు, సీఎల్ఆర్పీ, 66 మంది సాంకేతిక సహాయకులు, 22మంది కంప్యూటర్ ఆపరేటర్లు, ఏడుగురు ఈసీలతో మొత్తం 106 మంది సిబ్బంది నిరసనలో పాల్గొంటుండగా.. 144 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పెండింగ్ వేతనాల కోసం ఆందోళన బాట పట్టారు.

### వేతనాలు అందక ఇబ్బందులు



సకాలంలో వేతనాలు అందక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. మూడు నెలల వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలి.

– రామస్వామి, కంప్యూటర్ ఆపరేటర్, ఆత్మకూర్

### పేస్కేల్ అమలుకు నోచుకోలే..



ప్రభుత్వం ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీ మేరకు పేస్కేల్ అమలు చేయడం లేదు. మూడు నెలలుగా వేతనాలు అందక ఇంట్లో నిత్యావసర వస్తువులు కొనడానికి అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు రోజువారి ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించాం.

– బాలయ్య, జిల్లా జేఏసీ చైర్మన్

### వేతనాలు చెల్లించాలని..

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ ఉపాధి సిబ్బంది తనను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అందులో ఎక్కడ నిరసన కార్యక్రమాలు చేస్తామని వెల్లడించలేదు. జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం సిబ్బంది తమ విధుల్లో పాల్గొన్నారు. పెండింగ్ వేతనాల వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం చేస్తాం.

– ఉమాదేవి, డీఆర్‌డీఓ

## పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

పాన్‌గల్: మండలంలోని ప్రతి గర్భిణి పేరును రికార్డుల్లో నమోదు చేస్తూ పీహెచ్‌సీల్లోనే కాన్పులు చేయించుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌ఓ) రామయ్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి, వెంగళాయిపల్లి, శాగాపూర్, పాన్‌గల్ సబ్‌సెంటర్లను సందర్శించి గర్భిణుల పేర్ల నమోదు, ఆరోగ్య పరీక్షలు, చిన్నారుల వ్యాధి నిరోధక టీకాల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేర్లు నమోదు చేసుకున్న గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, వ్యాక్సినేషన్, చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆదేశించారు. గర్భిణుల్లో రక్త శాతం పెరగడానికి పౌష్టికాహారం తీసుకోవాలని, ఆహారంలో ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు ఉండాలన్నారు. వైద్యుల సూచనల మేరకు వ్యాయామం చేయాలన్నారు. 102, అంబులెన్స్ వాహనాలను వినియోగించుకోవడం, పీహెచ్‌సీలో కాన్పులు చేయించుకోవడంతో ప్రభుత్వం అందించే ప్రోత్సహకాలను వివరించాలని ఆయన సిబ్బందికి సూచించారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎంఎల్‌హెచ్‌పీ తారకశాంక్, వైద్య సిబ్బంది నర్సమ్మ, నాగేశ్వరి, రమాదేవి, సరళ, శ్రీలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.



తెల్లరాళ్లపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ రామయ్య

## ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ప్రణాళిక ప్రకారం చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని రేమద్దుల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కిష్టాపూర్‌తండా ప్రాథమిక పాఠశాల, గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి.. విద్యార్థికి పదో తరగతి కీలకమైన ఘట్టమని, భవిష్యత్‌కు పునాదిలాంటిదని సమయం వృథా చేయకుండా చదవాలన్నారు. వార్షిక పరీక్షలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీ గోవింద్‌నాయక్, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### అంబులెన్స్ వసతి కల్పించాలి

వీపనగండ్ల: మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా అంబులెన్స్ లేకపోవడంతో 40 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అంబులెన్స్ వసతి కల్పించకుంటే జిల్లా వైద్యాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రి ఆవరణలో మండల వైద్యాధికారి రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, వెంకటేశ్వర్లగౌడ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లను అర్హులందరికీ మంజూరు చేయాలని సీపీఐ నాయకులు రాబర్ట్, మోష బుధవారం అర్హులతో కలిసి ఎంపీడీఓ శ్రీరాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భీమన్న, ఉపేందర్, శాంతమ్మ, పద్మ, చంద్రమ్మ, వెంకటన్న తదితరులు ఉన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పాన్‌గల్: బండపల్లికి చెందిన కొమారి లక్ష్మీదేవమ్మకు మంజూరైన రూ.32 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం మాజీ జెడ్పీటీసీ రాంమూర్తినాయుడు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మేస్త్రీ నర్సయ్య, మేస్త్రీ ఆంజనేయులు, డీలర్ నర్సింహ, పెద్ద వెంకటస్వామి, రామకృష్ణ, నాగేశ్వర్, బాలమశన్న, బాలకృష్ణయ్య పాల్గొన్నారు.

### విహారయాత్రలతో విజ్ఞానం

వీపనగండ్ల: విద్యార్థులు ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలను సందర్శించడం వల్ల విజ్ఞానాన్ని పెంపొందించొచ్చని నాగర్‌కర్నూల్ పర్యాటక అధికారి నర్సింహ అన్నారు. బుధవారం కల్వరాల ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల విద్యా విజ్ఞాన విహార యాత్రలకు బయలుదేరుతుండగా ఆయన బస్సును ప్రారంభించారు. తెలంగాణ పర్యాటక దర్శిని కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు విజ్ఞానం అందించే చారిత్రాత్మక కట్టడాలు, మ్యూజియం సందర్శించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రాజవర్ధనాచారి, పాఠశాల కమిటీ చైర్మన్ కాంతమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్‌గౌడ్ ఉన్నారు.

### పిల్లలకు 'నులి' మాత్రలు వేయాలి

ఖిల్లాఘనపురం: ఈ నెల 10వ తేదీన 19ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని ఆరోగ్య కేంద్రం వైద్యుడు సురేందర్, ఎంఈఓ జయశంకర్ తెలిపారు. బుధవారం ఎమ్మార్సీ ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. 10వ తేదీన విద్యార్థులు ఎవరైనా పాఠశాలలకు హాజరు కాకుంటే 17వ తేదీన ఆస్పత్రిలో మాత్రలు వేస్తామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది నర్సింహులు, ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

### సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి (గోపాల్‌పేట): ఆస్పత్రిలో పనిచేసే వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం వారు రేవల్లి మండలంలోని సీహెచ్‌సీలో పనిచేసే కార్మికులతో మాట్లాడారు. ఆరు నెలల నుంచి జీతాలు రావడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్దు, జహీరాబేగం, లక్ష్మమ్మ, ఆశాబీ, వెంకటమ్మ, ఇందిరమ్మ పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

వనపర్తి రూరల్: సైబర్ నేరగాళ్లతో విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గణేష్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగం, సైబర్ నేరాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐని చెలిమి సంస్థ అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజాచారి, వెంకటేశ్వర్ల గుప్తా, వరదాచారి, రుద్రమదేవి, మహమ్మద్ షఫీ, పీడీ శ్రీనివాసులు, స్వరూప, గోపాల్, పోలీసులు రాజు, రఫీ, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జలంధర్‌రెడ్డి

**డబ్బులు పోగొట్టుకోవద్దు**

అమరచింత: డబ్బులు ఉచితంగా ఎవరూ ఇవ్వరని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌కు పంపిన మెసేజ్‌లకు ఆకర్షితులైతే ఉన్న డబ్బులు పోగొట్టుకునే ప్రమాదం ఉందని ఎస్ఐ సురేష్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆవరణలో బుధవారం సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ గేమ్‌లు, ఆన్‌లైన్ స్కీంల పేర్లతో సెల్‌ఫోన్లకు వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదని సూచించారు. అనుమానితుల నుంచి ఇలాంటి సమాచారం వస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

### జీరో బిల్లు వచ్చినా..

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని ట్రాన్స్‌కో అధికారులు అపహాస్యం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. బుధవారం మండలంలోని ఆరేపల్లిలో ఏటికాడి లక్ష్మణ్‌కు ఇంటికి సంబంధించి కొన్ని నెలలుగా జీరో బిల్లు వస్తుందని, అయినా లైన్‌మెన్ అనిల్ బిల్లు చెల్లించాలంటూ కనెక్షన్ తొలగించాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాగే గ్రామంలో చాలా మందికి సంబంధించిన కనెక్షన్లను తొలగించారన్నారు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## రుద్ర సహిత మహామృత్యుంజయ హోమం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల కోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో బుధవారం లోకకల్యాణార్థం అమావాస్య సందర్భంగా రుద్ర సహిత మహామృత్యుంజయ హోమం, లలితా సహస్రనామ స్తోత్రపారాయణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.



కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో మృత్యుంజయ హోమం చేస్తున్న అర్చకులు

**వీరభద్రస్వామి ఆలయంలో పూజలు**

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం కమ్మరి గోపి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుట్ట కింది భాగాన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమరచింత: మండలంలోని చంద్రగఢ్ కోటపై వెలసిన రామలింగేశ్వర ఆలయంతో పాటు నాగల్‌కడ్మూర్‌లోని దేవేంద్రచార్యుల మఠంలో, పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, శివచౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు.

వనపర్తి రూరల్: మండలంలోని అచ్యుతాపురం గుంటి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చన, నైవేద్యం, మహా మంగళ హారతి, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజల్లో రమేష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి, దొండాయిపల్లి, కొత్తపేట, మాందాపూర్, రాయినిపల్లి గ్రామాల మీదుగా, అన్నారం, కొత్తపేట గ్రామాల మీదుగా బుసిరెడ్డిపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఉమ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశరాము, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, రైతు సంఘం నాయకులు రామకృష్ణ మాట్లాడారు. గతంలో ఆయా గ్రామాలకు వనపర్తి డిపోకు చెందిన బస్సులు నడిచేవని, కానీ రోడ్డు సౌకర్యం సక్రమంగా లేదని బస్సులను రద్దు చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆయా గ్రామాలకు ప్రస్తుతం బీటీ రోడ్డు నిర్మించారని, దీంతో ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ విషయంపై డిపో ఏడీసీ వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించి విషయాన్ని డీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

### జాన్‌వెస్లీ ఎంపికపై హర్షం

వీపనగండ్ల/మదనాపురం: సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఎంపిక కావడంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దళిత బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా వెలుగొంది ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించిన దళిత నేతకు కార్యదర్శి పదవి ఇవ్వడం సీపీఎంకే సాధ్యం అవుతుందని నాయకులు మురళి, కాశన్న, బాలస్వామి, సీహెచ్ వెంకటయ్య, ఈశ్వర్, శ్రీనివాసులు, మనివర్ధన్, చెన్నయ్య, వెంకటేష్, చీర్ల ప్రసాద్ చిరంజీవి, మాసన్న, లక్ష్మయ్య, మొగిల, శివాజీ, నరేందర్ అన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ క్రీ.శే.కోదండరామిరెడ్డి సతీమణి సుభద్రమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, విండో డైరెక్టర్ ప్యాట బాలరాజు, నాయకులు తిరుపతయ్యనాయుడు, రాంచందర్‌రావు, భాస్కర్‌రెడ్డి, సాయిలు, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్..**

సుభద్రమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్ గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 2వ వార్డు రామలయంవీధికి చెందిన హోటల్ కురుమన్న తండ్రి బాలయ్య(75) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 8వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, సింగిల్‌విండో డైరెక్టర్ నందిమల్ల భాస్కర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లాల్కోట రవి బాలయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కొండన్న, ముత్యాలు మేస్త్రి, చంద్రశేఖర్‌రెడ్డి, మెకానిక్ రాజిరెడ్డి, మన్యం ఉన్నారు.

### మహిళ అదృశ్యం

కొత్తకోట రూరల్: మండలంలోని విలియంకొండతండాకు చెందిన మంజుల కనిపించడం లేదని భర్త గోపాల్‌నాయక్ కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు గోపాల్ నాయక్ భార్య మంజుల ఈనెల 28 నుంచి కనిపించకపోవడంతో తెలిసిన, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో భర్త ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

### 'దళితులపై దాడులు సరికాదు'

వనపర్తి (గోపాల్‌పేట): దళితులపై దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ప్రశ్నించారు. బుధవారం గోపాల్‌పేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి మూడు రోజుల క్రితం దాడికి గురైన ఏదుట్ల యాదగిరిని ఆయన పరామర్శించి ఎస్ఐ నరేష్‌తో మాట్లాడి కేసుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంతటి వారైనా దళితులపై అ న్యాయంగా దాడులు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవి, అమరేష్, మతీన్ ఉన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్‌కు సంబంధించిన టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మోహన్ బాబు, జిల్లా బాధ్యులు సునీల్‌కుమార్‌రెడ్డి వెంకటరమణ, శివుడు, మల్లికార్జున్ రమేష్, శివశంకర్, ఈశ్వర్, కిరణ్ కుమార్, దర్గయ్య, మహేశ్వరచారి తదితరులు ఉన్నారు.

### తహసీల్దార్ ఎదుట బైండోవర్



పాన్‌గల్: మండలంలో ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించి సారా తయారీదారులు, విక్రేతలను పట్టుకొని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి, ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు. మండలంలోని ఆకునోనిపల్లె తండాలో నేనావత్ చంద్రూ, శాగాపూర్‌తండాలో బెక్యామ్మ సారా తయారీదారులు, చిక్కేపల్లిలో మండ్ల ఊషమ్మ, ముంతరాముడు, కేతేపల్లికి చెందిన అన్మగండ్ల మాధవి సారా విక్రయిస్తూ పట్టుబడగా.. వారి నుంచి 16 లీటర్ల సారా పట్టుకున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు రాజు, బాలరాజు, కురుమూర్తి పాల్గొన్నారు.

### క్షయ నివారణకు పాటుపడదాం



కొత్తకోట (ఆత్మకూర్): క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, లక్షణాలు ఉన్న వారికి వైద్య పరీక్షలు చేయించాలని వైద్యాధికారి నందకిషోర్, జిల్లా టీబీ టీం ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని రేచింతల పంచాయతీ కార్యాలయంలో వందరోజుల టీబీ కార్యక్రమంలో భాగంగా 72 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త షాహీన్, ఆశాలు నిర్మల, మంజుల, మాధవి, లావణ్య, ల్యాబ్ టెక్నీషియన్ దాసు, శివరామకృష్ణ, లక్ష్మణ్, వైద్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆనంద్‌కు సన్మానం



ఆత్మకూర్: జాతీయ మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా రాష్ట్రం తరఫున ఆరేపల్లికి చెందిన మత్స్యకారుడు ఏటికాడి ఆనంద్ రాష్ట్రపతి అవార్డు అందుకోవడం నియోజకవర్గానికే గర్వకారనమని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మక్తల్‌లో ఎమ్మెల్యే శ్రీహరి ఆనంద్‌ను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాలుసు, నాగన్న, వెంకటన్న, గద్వాల శ్రీను, రామచంద్రయ్య, సురేందర్, నరేందర్, శ్రీహరి, వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాలకు చెందిన పోతుల భవ్యశ్రీ, బర్కం శ్రావ్యశ్రీ, సింగారపు ఝాన్సీ, పోతుల సిద్ధార్థ కిక్ బాక్సింగ్, గోజురియో కరాటే పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని మాస్టర్ వరుణ్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు, మాస్టర్‌ను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పోతు శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌శెట్టి, ప్రదీప్‌కుమార్, రమేష్, ఆంజనేయులు, నరేష్‌కుమార్, రాజు, కురుమన్న ఉన్నారు.